




కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా నగరంలో తల్లిదండ్రులు వారి చిన్నారులను చిన్నికృష్ణ,గోపికల వేషాదరణలతో అలంకరించిన వేషధారణలు ఎంత గానో ఆకట్టుకుంటున్న దృశ్యాలు

హైదరాబాద్ వార్త



# అనుమతిచ్చిన అధికారి ఎవరూ..!

**-ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో పర్మిషన్లపై హైడ్రా ఆరా**
**-ఆయా విభాగాల అధికారుల వివరాలు సేకరణ**
**-కూల్చివేతల సమయంలో అడ్డగిస్తున్న నిర్మాణదారులు**
**-అన్ని అనుమతులు తీసుకున్నామంటూ అధికారులతో వాగ్వాదం**
**-హైడ్రా చర్యలపై పర్మిషన్ ఇచ్చిన ఆఫీసర్లలో టెన్షన్ టెన్షన్**



**హైదరాబాద్, ఆగస్టు 26,ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ( హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ ఎసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) గత కొన్నిరోజులుగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉండటంతో హైడ్రా తన, మన అనేభేదం లేకుండా సాఫీగా పనిచేసుకుంటూ పోతుంది. ఇప్పటికే ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో నిర్మించిన పలు అక్రమ కట్టడాలను గుర్తించి నేలమట్టం చేసింది. ఇందులో హీరో నాగార్జునతోపాటు మరికొందరు ప్రముఖుల కట్టడాలను హైడ్రా కూల్చివేసింది. ఇలా అక్రమ కట్టడాల విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గకుండా హైడ్రా దూకుడు ప్రదర్శిస్తుండటంతో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ..అక్రమ కట్టడాలను గుర్తించి ఎక్కడికక్కడ నేలమట్టం చేస్తున్న హైడ్రా అందుకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపైనా యాక్షన్ తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ఇటీవల కూల్చివేతల సమయంలో హెచ్ఎండీఏ, ఇరిగేషన్ శాఖ అనుమతి ఇవ్వడంతోనే తాము కట్టడాలు చేపట్టామని భవన నిర్మాణదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారని తెలుస్తుంది. దీంతో గవర్నమెంట్ ల్యాండ్స్, ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో కట్టడాలకు అనుమతిచ్చిన అధికారులు ,క్షేత్రస్థాయి సిబ్బంది వివరాలను హైడ్రా సేకరిస్తున్నాట్లు తెలుస్తుంది. దీంతో ఆయా ప్రాంతాల్లో పర్మిషన్ ఇచ్చిన అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. హైడ్రా ఏక్షణం ఎలాంటి యాక్షన్ తీసుకుంటుందోనని అధికారులు , క్షేత్రస్థాయి సిబ్బంది టెన్షన్‌తో వణికిపోతున్నట్లు సమాచారం.

**ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ పరిధి..**
ప్రతి చెరువుకు కూడా నీరు నిల్వ ఉండే ప్రాంతం లేదా నీరువిస్తరించే ప్రాంతాన్ని ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టిఎల్)అని అంటారు. ఆతర్వాత చెరువు పరిధిని బట్టి కొన్నిమీటర్ల బఫర్‌జోన్ ఉంటుంది. అయితే హైదరాబాద్‌లో ఉన్న పలుచెరువుల్లో ఎఫ్‌టిఎల్,బఫర్‌జోన్‌లలో పట్టా భూములు కూడా ఉన్నాయి. కానీ ఆపట్టాభూముల్లో నీటిపారుదల శాఖ నిబంధనల ప్రకారం అందులో శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదు. అక్కడ కేవలం వ్యవసాయం లేదా మొక్కలు పెంచుకోవడం, నర్సరీలు ఏర్పాటు చేసుకునేందుకు మాత్రమే అనుమతిస్తారు. కానీ పలువురు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో అక్రమంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. అలాగే చాలామంది పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లు కూడా ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌ల పరిధిలో ఉన్నాయి. వీటికి జిహెచ్ఎంసి అధికారులు సైతం నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు.

**అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందే..**
కబ్జాలు ,ఆక్రమణలు కూల్చివేస్తున్న హైడ్రా చర్యలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు గతంలో ఈదారుణాలకు కారణమైన ఆఫీసర్లపైనా చర్యలు తీసుకోవాల్సిందేనని సోషల్‌మీడియా వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆయా ఆఫీసర్లకు ఇవి నిబంధనలకు విరుద్ధమని తెలియకుండానే అనుమతులు ఇచ్చారా ..తెలిసి ఎలా పర్మిషన్ ఇస్తారు అని ప్రశ్నిస్తున్నారు. హైడ్రాకు వచ్చిన ఫిర్యాదులు ,శాటిలైన్ ద్వారా గుర్తించిన ఆక్రమణలపై పూర్తిస్థాయిలో ఎంక్వైరీ చేసి ,నిర్మాణ్ణాలను కూల్చివేస్తూనే వాటికి పర్మిషన్ ఇచ్చిన ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని...అలా చేస్తేనే హైడ్రాలో సీరియస్‌నెస్ కనిపిస్తుందని చెబుతున్నారు. ఆతర్వాత ఇతర ఏ అధికారి అలాంటి కార్యకలాపాలకు పాల్పడాలంటే భయపడాలని పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# బేగంపేట మెట్రో స్టేషన్ వద్ద రోడ్డు ప్రమాదం

**-పంజాగుట్ట గ్రీన్ ల్యాండ్స్ నుంచి బారులు తీరిన వాహనాలు**
**-బేగంపేటలో తరచూ ట్రాఫిక్ జాం**
**-దృష్టి సారించని ట్రాఫిక్ ఉన్నతాధికారులు**




,బేగంపేట లో ఆగుతూ సాగుతున్న వాహనాలు.

**బేగంపేట ఆగస్టు 26,ప్రభాతవార్త**
బేగంపేట అంటే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది ట్రాఫిక్ జాం. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఈ మార్గంలో ఉత్పన్నమవుతున్నా పరిష్కారానికి ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.సోమవారం ఉదయం మరో సారి బేగంపేట మార్గం వాహనాల బారులు తీరడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది.బేగంపేట వైపు నుంచి పంజాగుట్ట వైపు కు ఏపీ 03 బీ వీ3063 ద్విచక్ర వాహనంపై మణుగూరు పవర్ ప్లాంట్ లో ఎస్పీఎఫ్ ఎస్ఐ గా విధులు నిర్వర్తిస్తున్న శంకరరావు,అతని కుమార్తె ప్రసన్నలు పంజాగుట్ట వైపు ప్రయాణిస్తున్నారు.ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టీఎస్10యుసీ 5699 టెంపో వాహనం బలంగా ఢీకొంది.ఈ ఘటనలో శంకరరావుకు తీవ్ర గాయాలు కాగా,ప్రసన్న తలకు తీవ్ర గాయం అయి సంఘటనా స్థలంలోనే మృతి చెందింది.ఈ ప్రమాదం జరిగిన ప్రాంతం బేగంపేట ఫ్లై ఓవర్ పైన బేగంపేట మెట్రో స్టేషన్ వద్ద కావడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిల్చిపోయింది.ఇది కొద్ది సేపటికే అటు గ్రీన్ ల్యాండ్స్ చౌరస్తా నుంచి ఇటు ప్యారడైజ్ వరకు భారీగా వాహనాలు నిల్చిపోయాయి.బేగంపేట లో వాహనాలు పెద్ద ఎత్తున నిల్చిపోయాయి.దీంతో ఫతేనగర్, కూకట్‌పల్లి,పంజాగుట్ట వైపు నుంచి వస్తున్న వాహనదారులు బేగంపేట లో ట్రాఫిక్ లో చిక్కుకు పోయారు.దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.బేగంపేట మయూరి మార్గ్ నుంచి ప్రకాశంనగర్ వైపు వెళ్లే వారు,శ్యాంలాల్ బిల్డింగ్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే వారు ట్రాఫిక్ లో చిక్కుకున్నారు.వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారుల అభివృద్ధి జరగకపోతుండటం, బేగంపేట లో రోడ్డు వెంట ఉన్న వ్యాపార సముదాయాలు,ఆసుపత్రులు,హోటల్స్ ఇలా ఎవరికీ పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాటికి వచ్చే వారు తమ వాహనాలను సికింద్రాబాద్ పంజాగుట్ట వెళ్లే ప్రధాన రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు.దీంతో రోడ్డుపైన ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఇది ఈ రోడ్డుపై నిత్య కృత్యం అయినప్పటికీ ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఈ మార్గంపై దృష్టి సారించకపోవడాన్ని వాహనదారులు,ప్రజలు తీవ్రంగా దుయ్యబడుతున్నారు.అదీ కాకుండా ముఖ్యమంత్రి,మంత్రులు, వివిఐపీలు ప్రయాణించే బేగంపేట మార్గంలో ట్రాఫిక్ జాం నియంత్రణపై అధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి రోజు ఉదయం,సాయంత్రం సమయంలో ఈ మార్గంలో ప్రయాణించాలంటే గంటల తరబడి సమయం వృధా అవుతుందని వాహనదారులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.ఇక బేగంపేట ఫ్లై ఓవర్ పైన ఒక ప్రమాదం ఏదైనా జరిగిందంటే చాలు గంటల తరబడి ట్రాఫిక్ జాం అవుతుంది.ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు బేగంపేట మార్గంపై దృష్టి సారించి ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.

## అంగరంగ వైభవంగా బోనాలు



గౌలిదొడ్డిలోని వివేకానందనగర్ కాలనీలో అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తజనం దృశ్యం

**నార్సింగి, ఆగస్టు 26 ప్రభాతవార్త :** కొలిచిన వారికి కొంగు బంగారంగా నిలుస్తున్న అమ్మవారి బోనాల వేడుకలు గండిపేట మండలం గౌలిదొడ్డి వివేకానందనగర్ కాలనీలో అంగరంగ వైభవంగా జరిగాయి. డప్పుల దరువుకు అనుగుణంగా శివసత్తుల పూనకాలు... పోతురాజుల ఆహాకారాలు... భక్తుల నృత్యాలు ఇలా ఆద్యాంతం అమ్మవారి బోనాల ఉత్సవాలు ఆనందభరితంగా సాగాయి. కాలనీలోని వందలాది మహిళలంతా తలంటు స్నానాలు చేసి, పసుపు, కుంకుమ, వేపాకులతో అందంగా అలంకరించిన బోనాలను తలపై ఎత్తుకొని ఒకేసారి రావడంతో అమ్మవారి ఆలయం, రోడ్లన్నీ జాతరను తలపించాయి. తియ్యని కంఠంతో అమ్మవారిని స్తుతిస్తూ మహిళలు పాడిన భక్తి పాటలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలలో రాజేంద్రనగర్ బిఆర్ఎస్ ఇంచార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి, వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ గొల్ల స్వరూప నాగేష్ యాదవ్, మాజీ ఎంపిటిసి నాగేష్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, బిఆర్ఎస్ అధ్యక్షులు సంతోష్, కాలనీ ప్రతినిధులు బిక్షపతి యాదవ్, మల్లేష్ యాదవ్, బల్‌రామ్, తిరుపతయ్య, బసంత్, కొండల్‌రెడ్డి, ప్రభాకర్, వేణు తదితరులు పాల్గొని అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కార్తిక్‌రెడ్డి, నాగేష్ యాదవ్‌లు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలలో, ప్రతీ పర్వదినంలో ఆరోగ్య రహస్యం దాగి ఉందని పేర్కొన్నారు. వేపాకులు, పసుపు, కుంకుమ, మట్టికుండా ఇలా బోనాల వేడుకలకు వాడే ప్రతీ పదార్థం మనకు అంటు వ్యాధులను కలిగించే వైరస్‌లను నాశనం చేసే శక్తిని కలిగి ఉందని తెలిపారు. పూర్వం వర్షాకాలం ఆరంభంలో వచ్చే వానలు, వరదల వలన వైరస్‌లు భూమిలోంచి పైకి వచ్చి మనుషులకు రోగాలు కలిగించాయని, ఈ వ్యాధుల బారి నుంచి రక్షణ పొందేందుకు మన పెద్దలు బోనాల వేడుకలను ప్రారంభించారన్నారు. మన ఋషులు సూచించిన ప్రతీ కార్యం జీవకోటికి మేలు చేసేదే ఉంటుందని, మన సంస్కృతి సాంప్రదాయాలు మనం పాటిస్తూ, మన బిడ్డలతో కూడా ఆచరింపచేయాలని సూచించారు.

## సలకం చెరువులో ఒవైసీ కాలేజీ

**-2012లో వ్యవసాయ భూమి ..బిజెపి ఆసక్తికర ట్వీట్**

**హైదరాబాద్, ఆగస్టు 26,ప్రభాతవార్త:**
చెరువల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు "హైడ్రా"కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. అయితే బండ్లగూడ మండలం సలకం చెరువును ఆక్రమించి ఒవైసి బ్రదర్స్ ఫాతిమా మహిళా కాలేజీ నిర్మించారని ఆరోపణలు వెల్లువేత్తాయి. చెరువులో ఆక్రమణలు స్పష్టంగా కనిపిస్తున్నా ఎందుకు కూల్చడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో గూగుల్‌మ్యాప్ చిత్రాలతో సోషల్‌మీడియాలో పోస్టులు వైరల్‌గా మారాయి. ఈనేపథ్యంలోనే తెలంగాణ బిజెపి ఎక్స్‌వేదికగా ఆసక్తికర పోస్టు చేసింది. 2012లో వ్యవసాయ భూమి నుంచి 2024లో ఫాతిమా ఒవైసి ఉమెన్స్ కాలేజీ వరకు అని గూగుల్ మ్యాప్ ఫోటోను వివరించింది. ఫాతిమా ఓవైసీ ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసి కుమార్తె అని తెలిపింది. ఈసలకం చెరువులో ఓవైసి కాలేజీపై రేవంత్ ప్రభుత్వం లేదా హైడ్రా ఏదైనా చర్యలు తీసుకునే ధైర్యం చేయగలదా ?అని ప్రశ్నించింది.

## పబ్‌లకు వెళ్ళే యువతీయువకులకు కమిషనర్ సూచన

**పంజగుట్ట, ఆగస్టు 26 (ప్రభాతవార్త):**
పబ్‌లకు తరచుగా వెళ్ళే యువతీ యువకులు బాధ్యతతో వ్యవహరించాలని నగర పోలీసు కమీషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి నగర యువతకు సూచన చేశారు. తెలియకుండా కొంతమంది ఈ ఊబిలోకి లాగబడుతున్నారని ఆయన అన్నారు. కొంతమంది వ్యక్తులు పార్టీల పేరుతో యువతులను పబ్‌లకు పిలిచి కూల్ డ్రింక్‌లలో తక్కువ మోతాదులో మత్తు పదార్ధాలను కలిపి ఇస్తున్నారని ఆయన తెలిపారు. దీంతో తెలియకుండా నాలుగైదుసార్లు వీటిని సేవించిన వారు తర్వాత తర్వాత మత్తు పదార్ధాలకు బానిసలుగా మారుతున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వం పూర్తిగా నిరోధించడానికి సకల చర్యలు చేపడుతుందని, ప్రస్తుతం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డ్రగ్స్ మనిషి నైతితను దెబ్బతీస్తుందని, తల్లి దండ్రులు కూడా తమ పిల్లల నడవడికను జాగ్రత్తగా గమనించుకోవాల్సన అవసరం ఎంతైనా ఉందన్నారు. నగరంలో అక్కడక్కడా గంజా సేవనం సాగుతుందని తమకు సమాచారం ఉందని ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి చాలా వరకు నిరోదించగలుగుతున్నామని తెలిపారు. ముఖ్యంగా ప్రైవేటు వ్యక్తులు ఇచ్చే పార్టీల విషయంలో ఆ వ్యక్తి గత చరిత్ర తెలుసుకుని పార్టీలకు అటెండ్ అవ్వాలని ఆయన సూచించారు.

## సన్‌సిటీలో డ్రగ్స్ విక్రయిస్తున్న కిలాడి అరెస్టు

**-50 గ్రాములు ఎండిఎంఎ, 25 గ్రాములు కొకైన్ స్వాధీనం**



**అత్తాపూర్ ఆగస్టు26,ప్రభాతవార్త :**
ఓ కిలాడీ నుండి డ్రగ్స్ పట్టుకున్న సంఘటన రాజేంద్రనరగ్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు వివరాల ప్రకారం... నైజీరియాకు చెందిన కేటుగాళ్లు బెంగళూరులో నివాసం ఉంటూ గత కొంతకాలంగా బెంగుళూరు నుండి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తూ సన్ సిటీని అడ్డాగా చేసుకొని ఈ దందా సాగిస్తున్నట్లు తెలియడంతో ఆదివారం రాత్రి పక్కా సమాచారంతో సన్‌సిటి దగ్గర నైజీరియాకు చెందిన లేడి తంబా ఫిడెల్మా బయొన్‌వువా లవ్చ్ డ్రగ్స్ అమ్ముతుండగా 50 గ్రాముల ఎండిఎంఎ,25 గ్రాముల కొకైన్ పట్టుకొని సీజ్ చేసి ఆ మహిళను అరెస్టు చేశారు.బెంగళూరుకు చెందిన మైటీ గాడ్ అనే వ్యక్తితో డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు విచారణలో తెలింది. అయితే ఈ దందా సాగిస్తున్న వారిలో నాలుగురు పరారిలో ఉన్నారని కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు తెలిపారు.

## ఒకే రిజిస్ట్రేసన్ నెంబర్‌పై రెండు ఆటోలు

**అత్తాపూర్ ఆగస్టు26,ప్రభాతవార్త :** ఒకే రిజిస్ట్రేషన్ నెంబర్‌పై రెండు ఆటోలు నడిపిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న సంఘటన మైలర్‌దేవ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో చోటుచేసుకుంది.పూర్తి వివరాల్లో వెళ్లితే... దుర్గానరగ్ చౌరస్తా వద్ద ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ సిబ్బందితో కలిసి విధులు నిర్వహిస్తున్న సమయంతో ఒకే రిజిస్ట్రేషన్ టిఎస్ 15 యూఎఫ్ 15 43 నెంబర్ ఉన్న రెండు ఆటోలును కనిపించాయి.దీంతో వెంటనే అలర్ట్ అయి రెండు ఆటోలను ఆపి వివరాలను తెలుసుకున్నారు. అందు లో ఒకటి ఒరిజినల్ ఆటో కాగా మరోకటి ఫెక్ నెంబర్ ప్లేట్‌గా ఆటోగా గురించి రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని మైలర్‌దేవ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఆక్రమించేయ్..హద్దులు మార్చేయ్

**-చెరువులను చెరబట్టి నిర్మాణాలు**
**-అక్రమార్కులకు అనుగుణంగా మారుతున్న ఎఫ్‌టిఎల్ కో-ఆర్డినేట్స్**
**-మూడుసార్లు మారిన చిన్నదామెర చెరువు ముఖచిత్రం**
**-దుండిగల్ మున్సిపల్ పరిధి అనేక చెరువుల్లో ఆక్రమణలు**
**-ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం**
**-హైడ్రా దృష్టిసారించాలని కోరుతున్న స్థానికులు**

**దుండిగల్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** మానవ మనుగడలో అత్యంత కీలకమైనది జలవనరులు. మన ప్రాంతాలను పరిపాలించిన మహామహులు భవిష్యత్తు తరాలకు నీటి గోస ఉండకూడదనే మహోత్తర ఆశయంతో అనేక చెరువులు, కుంటలను సృష్టించారు. గొలుసుకట్టు కాలువలు తవ్వి ఒక దానికి ఒకటి అనుసంధానం చేశారు. చెరువులను కల్పతరువుగా భావిస్తూ అలుగు పోసిన్నాడు అట్టాహాసంగా సంబురాలు చేసుకునేవారు. నిండుకుండలా అలరారే చెరువులు, కుంటలు నేడు ఆక్రమణలతో అల్లాడుతున్నాయి. హద్దు అదుపు లేకుండా చెరబట్టి అడ్డగోలుగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. గొలుసుకట్టు కాలువలను ధ్వంసం చేస్తూన్నారు. ఇష్టానుసారంగా హద్దులు మార్చడంతో చెరువులు విస్తీర్ణం కోల్పోయి చిన్నబోతున్నాయి. చెరువులకు పూర్వవైభవం తీసుకొస్తాం అని నాయకులు చెప్పిన మాటలు ఆచరణను నోచుకోలేదు. గత ప్రభుత్వాల ఉదాసీన వైఖరితో కార్పొరేట్ సంస్థల కబంద హస్తాల్లో చిక్కుకొని చెరువులు ఉనికిని కొల్పొయే పరిస్థితికి చేరుకున్నాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం జలవనరుల సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించి హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేయడంతో ఒక్కొ చెరువుకు విముక్తి లభించడం శుభపరిమాణంగా పేర్కోనవచ్చు. హైడ్రా చర్యలతో కబ్జాదారులకు వణుకు మొదలైంది. చెరువుల ఆక్రమణలపై నిర్ధాక్షిణ్యంగా కొరడా ఝుళిపిస్తున్న హైడ్రా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు చెరువులపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో పదుల సంఖ్యలో చెరువులు, కుంటలు ఉన్నాయి. పలు చెరువుల్లో ఆక్రమణలు చోటు చేసుకోగా కొన్ని చోట్ల గొలుసుకట్ట కాలువలు ధ్వంసం చేసి నిర్మాణాలు చేపట్టారు. సదరు ఆక్రమణలపై గతంలో అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎటుంటి చర్యలు లేవు. ఇప్పటికైనా హైడ్రా విభాగం స్పందించి ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**దుండిగల్ ...**దుండిగల్ పరిధిలో ఎనిమిది చెరువులు ఉన్నాయి. ఇందులో చిన్నదామెర చెరువు ఎఫ్‌టిఎల్‌లో ఓ ఇంజినీరింగ్ కళాశాల భారీ బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టింది. అరకొర చర్యలతో చేతులు దులుపుకున్నారు. చెరువు ఎఫ్‌టిఎల్ కో-ఆర్డినేట్స్ మూడుసార్లు మార్చేశారు. గత మ్యాపులోని ఎఫ్‌టిఎల్‌లో ఉన్న సర్వేనంబర్లు ప్రస్తుతం ఉన్న మ్యాపులో కనిపించవు. ఇందుకు సదరు సర్వేనంబర్లలో ఓ రియల్ సంస్థ భూములు కొనుగోలు చేయడమే అని తెలుస్తుంది. పల్లెవాణి కుంటలో బహుళ అంతస్థుల నిర్మాణాలు, పెద్ద చెరువు బఫర్‌లో ప్లాట్లు వెలిశాయి. పెద్ద చెరువు గొలుసుకట్టు నాలా సైతం ఆక్రమణకు గురైంది.

**భౌరంపేట...**భౌరంపేట పరిధిలో పదమూడు చెరువులు ఉన్నాయి. ఇందులో రామోజీకుంట ఎఫ్‌టిఎల్ కో-ఆర్డినేట్స్ కార్పొరేట్ పాఠశాలకు అనుగుణంగా మారిపోయాయి. పెద్ద చెరువు నాలా ధ్వంసం కావడంతో పాటు బఫర్‌జోన్లో అనేక నిర్మాణాలు వెలిశాయి. కామునికుంట ఎఫ్‌టిఎల్ సైతం కబ్జా పాలైంది.

**బహాదూర్‌పల్లి...**బహాదూర్‌పల్లి పరిధిలోని ఐదు చెరువులు ఉన్నాయి. ఇందులో బొబ్బఖాన్ చెరువు గొలుసుకట్టు నాలాను ధ్వంసం చేసి ఓరియల్ సంస్థ హైరైజ్ నిర్మాణాలు చేపట్టింది. ఇరిగేషన్, రెవిన్యూ సంయుక్త సర్వే చేసి నాలా ధ్వంసమైనట్లు గుర్తించి ఏడాది అయిన నేటికి చర్యలు లేవు. ఫిర్జాదికుంట ఎఫ్‌టిఎల్‌లో అనేక నిర్మాణాలు జరుగగా, సందయ్యకుంట సగానికి తగ్గింది.

**దొమ్మరపోచంపల్లి...** దొమ్మరపోచంపల్లి పరిధిలో పది చెరువులు ఉన్నాయి. ఇందులో చింతల కుంట, చిన్నగంగారం, పెద్దగంగారం కుంటల్లో అక్రమ నిర్మాణాలు చోటు చేసుకోగా మీదిముల్ల వాణికుంట, పడగసముద్రం ఎఫ్‌టిఎల్ స్థలాలను ఆక్రమించేశారు.

**గాగిల్లాపూర్....**గాగిల్లాపూర్ నాలుగు చెరువులు ఉన్నాయి. లేక్‌వ్యూ పేరుతో ఓ రియల్ సంస్థ ఉస్మాన్‌కుంట చుట్టూ నిర్మాణాలు చేపట్టగా గొలుసుకట్టు నాలా పరిస్థితి ప్రశ్నార్థకమే. లక్కుకుంటను పూర్తిగా మట్టితో నింపేశారు. బుర్జకుంట సగానికి పైగా ప్లాట్లుగా మారింది.

**మల్లంపేట..**మల్లంపేట పరిధిలో రెండు చెరువులు ఉండగా మల్లంపేట భౌరంపేట సరిహద్దుగా ఖత్వ చెరువు ఉంది. ఖత్వ చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్‌జోన్‌ల ఎకరంకు పైగా స్థలాన్ని ఓ రియల్ సంస్థ ఆక్రమించినట్లు అన్ని విభాగాల అధికారుల బృందం నిర్ధారించింది. సదరు స్థలంలో ఏడు విల్లాలను నిర్మించినట్లు గుర్తించిన నేటికి చర్యలు లేవు. మల్లంపేటలోని చెన్నం చెరువు ఎఫ్‌టిఎల్‌లో సైతం అనేక నిర్మాణాలు వెలిశాయి.

**శంభీపూర్...**శంభీపూర్ పరిధిలో మూడు చెరువులు ఉన్నాయి. ఇందులో అబ్దుల్‌మియా కుంట ఎఫ్‌టిఎల్ బఫర్ ఆక్రమించి నిర్మాణాలు వెలిశాయి.

## కూల్చివేతల నుంచి సామాన్యులు,మధ్యతరగతి ప్రజలను మినహాయించాలి



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్. ఆగస్టు 26 ప్రభాతవార్త:** చెరువుల పక్కన రెండు మూడు దశాబ్దాల క్రితమే ఇండ్లు కట్టుకున్న సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలకు ఇబ్బంది కలిగించవద్దని హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు సోమవారం లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల పక్కన ఎన్నో ఏళ్ల క్రితం ఇండ్లు కట్టుకున్న మధ్యతరగతివారు హైడ్రాతో భయాందోళనలకు గురవుతున్నారని, వీరిలో చాలా మంది ఇంకా ఇంటి లోన్స్ కడుతున్నారని అన్నారు. చెరువులను ఆక్రమించిన బడాబాబుల ఫాం హౌజ్‌లు, భవనాలు కూల్చివేయడం హర్షణీయమన్నారు. అయితే మధ్యతరగతి, సామాన్యులను కూల్చివేతల నుంచి మినహాయించాలని హైడ్రా కమీషనర్‌కు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా స్పష్టంగా ఉందని, సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు. హైడ్రా గురించి సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు భయపడవద్దని ఆయన సూచించారు. చెరువుల పక్కన కొత్తగా చేపట్టే నిర్మాణాలను మాత్రం ఉపేక్షించేది లేదన్నారు.


చెరువు భూమిలో నిర్మించిన ప్రహరీని చూపుతున్న గ్రామస్తులు

## చెరువును ఆక్రమిస్తూ ప్రహరీ నిర్మాణం
### అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల ఆందోళన

**ములుగు, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం చెరువుల ఆక్రమణను అరికట్టడానికి హైడ్రా అనే అథారిటీని ఏర్పాటుచేసి అక్రమార్కుల భరతం పడుతుంటే మరోవైపు సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండ తిమ్మాపూర్ గ్రామంలో మాత్రం యదేశ్చగా చెరువును కబ్జా చేస్తున్న వైనం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బండతిమ్మాపూర్ గ్రామ శివారులో ఉన్న పాలసముద్రం చెరువు భూమిని ఓ ప్రైవేట్‌కంపెనీకి చెందిన వ్యక్తులు ఆక్రమించి రాత్రికి రాత్రి ప్రహరీ గోడను నిర్మించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, యువకులు మంగళవారం చెరువు భూమిలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను తొలగించాలని ఆందోళన చేపట్టారు. కంపెనీ నిర్వాహకులపై నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ చెరువు భూమిలో అక్రమ కట్టడాలను అరికట్టి చెరువును కాపాడాలని, అదేవిధంగా ఈ నిర్మాణాలకు పాల్పడ్డ వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ ఏఈ అస్సాంను వివరణ కోరగా పాల సముద్రం చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనులను ఆపాలని సంబంధిత కంపెనీ యజమానికి చెప్పడం జరిగిందని తెలిపారు. అట్టి నిర్మాణ పనులు ఆపకుంటే చట్టపరమైన చర్యలు తీసుకొని ఇదివరకు చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తామని వివరణ ఇచ్చారు.

## పద్మశాలి కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి
### -సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్


రాజ్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** నూతనంగా తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన రాజ్‌కుమార్‌కి పెద్దఎత్తున బీరంగూడ పద్మశాలి భవన్‌లో సన్మానం జరిగింది. పద్మశాలి సంఘం పట్టణం, మండలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. పద్మశాలి కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన గౌరవ అధ్యక్షులు అడెల్లి రవీందర్, కొకలా శ్రీనివాస్, మకాం మల్లేష్, సంఘం అధ్యక్షులు వనం యాదగిరి, గొప్ప దుర్గయ్య, మహేందర్, ఎల్లప్ప, అరిగె జ్ఞానేశ్వర్, చెన్న మోహన్, నర్సయ్య, వెంకట్ నారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మాలల శ్మశానవాటికలో మురికి కాలువను నిర్మించండి


మాలల స్మశాన వాటికలో నిండిన మురికి నీరు దృశ్యం

**నర్సాపూర్, ఆగస్టు 27. ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులోగల మాలల శ్మశానవాటికలో మురికి కాలువను నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌కు, కౌన్సిలర్ లక్ష్మినాగేశ్‌కు మాల సంఘం నాయకులు వినతి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్మశానవాటికకు సమీపంలోనున్న వివిధకాలనీలోని మురికినీరంతా శ్మశాన వాటికలోకి ప్రవేశిస్తుందన్నారు. దీంతో శ్మశానవాటికకు వెళ్లాలంటేనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. అంతేగాక అంత్యక్రియలు నిర్వహించాలంటే ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్ , అధికారులు స్పందించి మాలల స్మశాన వాటికలో మురికి నీరు నిలువ కుండా చర్యలు తీసుకోవాలని అదేవిదంగా మురికి కాలువను కూడ నిర్మించాలని వారు కోరారు..

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు పట్ల హర్షం


మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్

**గజ్వేల్, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** రాజకీయ ప్రేరేపితమైన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేయడం పట్ల గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశ సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడం పట్ల న్యాయ వ్యవస్థలపై నమ్మకం వచ్చిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలపై రాజకీయ కక్ష సాధించేందుకు ఈడి, సిబిఐలాంటి సంస్థలను ఉసిగొలిపి తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. ఎన్ని కుట్రలు ప్రయోగించినా పోరాటాన్ని కొనసాగించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. కవితను అరెస్ట్ చేసి ఐదు నెలల పాటు జైలులో ఉంచినా కెసిఆర్ వెనకడుగు వేయలేదని, న్యాయ వ్యవస్థలపై నమ్మకంతో న్యాయ పోరాటం సాగించడం వల్ల సుప్రీంకోర్టు ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేసిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ పోరాట పునాధులమీద పుట్టిన పార్టీ అని, ఎన్ని ఇబ్బందులు, కుట్రలు ప్రయోగించినా ధైర్యంగా ఎదుర్కొని కొట్లాడే దమ్ము ధైర్యం బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేసేదాకా పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్‌గౌడ్, అహ్మద్, శివకుమార్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**కొమురవెల్లి, ఆగస్టు 27, ప్రభాతవార్త:** చేర్యాలకు చెందిన తుంగ రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబీకులను జనగామ డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కొమ్ము రవి, కామెడీ జీవన్‌రెడ్డి, పుర్మ అగంరెడ్డి, మెరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**సిర్గాపూర్, ఆగస్టు 27,ప్రభాతవార్త:** మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని వాసర్ గ్రామంలో యండి షాదుల్ నివాసం వెనకాల పేకాట ఆడుతున్న 7 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం... యండి షాదుల్ నివాసం వెనర జూదం ఆడుతున్నట్లు తెలుసుకున్న ఎసై సిబ్బంది తుకారాం, లక్ష్మీకాంత్, రవి, సర్దార్‌తో కలిసి దాడి చేయగా జూదం ఆడుతున్న 7గురిని (జాదవ్ తిరుపతి, మ్యాత్రే వైజనాథ్, రాథోడ్ కిషన్, జాదవ్‌మారుతి, రాథోడ్‌కిషన్, షిండేసునీల్, ఎండి షార్దుల్‌లను అదుపులోకి తీసుకుని రూ.26,850, 5 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. జూదమాడిన వారికి కోర్టులో ప్రవేశ పెట్టామన్నారు.

# కబ్జాకు గురైన పాండవుల చెరువును కాపాడాలి

### బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్


మాట్లాడుతున్న మనోహర్‌యాదవ్

**గజ్వేల్, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో చెరువుల కబ్జాపై దూకుడు పెంచారని, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో చెరువుల పునరుద్దరణకు పూనుకోవాలని బిజెపి గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లను చదును చేసి చెరువుల విస్తీర్ణం సగానికి పైగా తగ్గించినా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కలెక్టర్ ద్వారా ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రాంతంలోనే పెద్ద చెరువు అయిన పాండవుల చెరువు సుమారు 104 ఎకరాల విస్తీర్ణంలో ఉంటే ప్రస్తుతం 49 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని, 50కి పైగా ఎకరాలను కబ్జా చేశారన్నారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లను మట్టితో చదును చేసి వెంచర్లు, ప్లాట్లు చేశారన్నారు. చేపల పెంపకంతో మత్స్యకారులకు ఉపాధి కల్పించిన చెరువు రోజు రోజుకు కబ్జాకు గురవుతుంటే మత్స్యకారుల జీవన పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ పాలకవర్గం రూ.6 కోట్లతో పాండవుల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పినా నీరు నిల్వ ఉంచేందుకు చెరువు లేకుండాపోయిందని, మున్సిపల్ పాలకవర్గం సంబంధిత అధికారులతో చర్యలు చేపట్టాలని, పాండవుల చెరువును పునరుద్ధరించి కబ్జా నుండి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రాంతంలో ఉన్న చెరువుల రక్షణకై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి అయిల మహేందర్, పట్టణ ఉపాధ్యక్షుడు నాయిని సందీప్, చెప్యాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాయిబాబా

## హైడ్రాను రాజధానికే పరిమితం చేయవద్దు
### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

**ముషీరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** హైడ్రాను రాజధానికి మాత్రమే పరిమితం చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూములను కబ్జాల నుండి కాపాడాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా విజ్ఞప్తి చేశారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జా ప్రభుత్వ భూములలో సొంత భవనాలు నిర్మించుకుని ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తించిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవటం కోసం హైడ్రా కమిటీని ఏర్పాటుచేయటం హర్షనీయమని అన్నారు. ప్రజా ప్రయోజనాలను కాపాడే హైడ్రాను నామమాత్రపు సంస్థగా కాకుండా దానికి ఒక చట్టబద్ధత కల్పించాలని కోరారు. హైడ్రా అధికార పార్టీకి కొమ్ము కాయకుండా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, ప్రజల్లో ఎలాంటి అపోహలకు తావు లేకుండా హైడ్రాను ఒక నిర్మాణాత్మక సంస్థగా రూపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి
### బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందచేస్తున్న జర్నలిస్టులు

**ముషీరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అంశంపై సీఎం తో చర్చించి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులు సభ్యులుగా ఉన్న తమ సొసైటీకి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతి నిధులు మంత్రిని కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బొల్లం శ్రీనివాస్‌లు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను మంత్రికి వివరించారు. ఎన్నో ఏళ్లనుండి జర్నలిస్టులు ఇళ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కల్పించి, న్యాయం చేస్తుందనే ఆశతో జర్నలిస్టులు అందరూ ఎదురు చూస్తున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ఆనందం, సీతారామరాజు, వీరారెడ్డి, పి.నాగవాణి, వేముల పుష్పలత, డి.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## అండర్ 16 బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో విజేత మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు


బాస్కెట్ బాల్‌లో విజేతగా నిల్చిన మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు

**అల్వాల్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్‌లో జరిగిన ఐదవ రాష్ట్ర యువజన అండర్ 16బాస్కెట్ బాల్ బాలికల విభాగంలో విజేతగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు విజేతగా నిల్చింది.మేడ్చల్ మల్కాజ్‌గిరి వికారాబాద్ జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో మేడ్చల్ మల్కాజ్‌గిరి 58,56 రెండు పాయింట్లతో విజయం సాధించింది.ఈ నెల 25,26తేదీలలో రెండు రోజులపాటు పోటీలు జరగగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి.ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ పోరులో ఇరు జట్లు నువ్వానేనా అన్నట్లుగా తలపడ్డాయి.ఆఖరి ఐదు నిమిషాల్లో జిల్లా జట్టు వ్యూహాత్మకంగాఆడి విజేతగా నిల్చింది.ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలలో వరుసగా రెండవ సారి జిల్లా జట్టు టైటిల్‌ను సాధించడం విశేషం.జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్ సిరిగిరి,ఉపాధ్యక్షుడు జోర్డాన్ రవి,పరిశీలకుడు విశాల్,కోచ్ శ్రీధర్‌తో పాటు జట్టు సభ్యులను అభినందించారు.తెలంగాణా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నార్మన్ ఈశాక్ జిల్లా జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

## గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా సాగాలి: ఏసిపి

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 27 ప్రభాతవార్త**

గణేష్ చవితి ఉత్సవాలను భక్తిశ్రద్దలతో శాంతియుతంగా పూర్తిచేసి ఐక్యతను చాటాలని బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ హనుమంతరావు సూచించారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ సమావేశపు హాలులో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ సమితి సమన్వయ సమావేశానికి వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ నాయకత్వంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసరావు, సిఐ గడ్డం మల్లేశ్, కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యుటీ కమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మా, కట్టా కుమార్‌లు ఉత్సవాలను నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సూచనలు, సలహాలను వివిధ విభాగాల అధికారులు అందజేశారు. జిహెచ్‌ఎంసి విద్యుత్ విభాగం, ట్రాఫిక్, ఫైర్ విభాగాల అధికారులతోపాటు మొత్తం 150 మంది గణేష్‌ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి

## చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం.. మహిళ రిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** పాతకక్షలతో ఓ చిన్నారిని కిడ్నాప్ చేసిన కేసును కాచిగూడ పోలీసులు కొన్ని గంటల్లోనే ఛేదించారు. మంగళవారం కాచిగూడ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి, అదనపు డీసీపీ జె.నర్సయ్య , కాచిగూడ డివిజన్ ఏసీపీ బి.రఘు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ బాలస్వామి మాట్లాడుతూ కామారెడ్డికి చెందిన తిరుపతి భార్య దాసరి మంజుల(29) వృత్తిరిత్యా బిక్షాటన చేస్తుంది. లచ్చ మమత దంపతుల సంవత్సరం 4 నెలల చిన్నారి శ్రీలక్ష్మి అమ్మమ్మ పార్వతమ్మతో కలిసి సోమవారం అర్ధరాత్రి కాచిగూడ రైల్వేస్టేషన్ బస్‌స్టాప్‌లో పడుకున్నారు. గతంలో జరిగిన పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని మంజుల ఆమె మర్ది మున్నా కలిసి చిన్నారి శ్రీలక్ష్మిని కిడ్నాప్ చేయడంతో అదేరోజు రాత్రి అమ్మమ్మ పార్వతమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా డబీర్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్లు తెలుసుకుని మంగళవారం చాకచక్యంగా పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. దాసరిమంజులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలంచినట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో అంబర్‌పేట డిఐ మల్లేశ్వరి, ఎస్ఐ సురేశ్‌కుమార్ ఉన్నారు.

## ఆటోలో బంగారు ఆభరణాలను మరిచిన మహిళ
### గంటల వ్యవధిలో అప్పగించిన పోలీసులు


బాధిత మహిళకు బంగారు ఆభరణాలను అప్పగిస్తున్న గౌరినాయుడు

**సరూర్‌నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ఆటో దిగేసమయంలో 25 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును మరచిపోయిన ఓ మహిళకు మీర్‌పేట్ పోలీసుల చొరవతో సొత్తుదక్కింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లెలగూడ గాయత్రీ నగర్ నివాసి మద్ది వనజ కుటుంబ సభ్యులతో కలిసి సరూర్‌నగర్ చెరువు కట్ట దిగువన ఉన్న శారదానగర్‌లోని ఓ వస్త్ర దుకాణానికి సోమవారం ఉదయం వచ్చింది. ఆ తర్వాత అక్కడే ఆటో ఎక్కి వారంతా ఇంటికి చేరుకున్నారు. అయితే ఆటో దిగిన తర్వాత మధ్యాహ్న సమయంలో వనజకు తన వెంట ఉన్న 25 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగు గుర్తుకు వచ్చి దానిని పోగొట్టుకున్నట్లు గ్రహించింది. ఈ మేరకు ఆమె మీర్‌పేట్ పిఎస్‌లో ఫిర్యాదు చేయగా డిఐ గౌరీ నాయుడు ఆధ్వర్యంలో రంగంలో దిగిన క్రైం పోలీసులు ఆటో ప్రయాణించిన మార్గంలో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆటోలో ఉన్న ఆభరణాల బ్యాగు కర్మన్‌ఘాట్ క్రాంతినగర్ గ్రౌండ్ ముందు రహదారిలో పడిపోగా వెనక వస్తున్న మరో ప్యాసింజర్ ఆటో డ్రైవర్ దానిని తీసుకున్నట్లు సిసి పుటేజీలో గమనించారు. దీంతో పోలీసులు కొన్ని గంటల్లోనే సదరు ఆటో డ్రైవర్ ఇంటిని ట్రేస్ చేసి అతని వద్ద నుండి బంగారు ఆభరణాల బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధిత మహిళకు సమాచారం ఇచ్చి మీర్‌పేట్ పిఎస్‌లో దానిని అప్పగించారు. ఈ మేరకు ఆమె పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను గుర్తించి వాటిని అప్పగించిన మీర్‌పేట్ డిఐ గౌరీ నాయుడు, క్రైం పార్టీ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

## త్యాగరాయ గానసభలో 'ప్రతిభకు పట్టం-గౌరవ సన్మానాలు'

**సైఫాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ఒక న్యాయవాది నివాసంలో పని మనిషిగా చేరిన మహిళ ఇంటికే కన్నం వేసి ఐదున్నర తులాల బంగారు అభరణాలు, కొంత నగదు దోపిడీ చేసి కటకటాలపాలైన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నారాయణగూడ పోలీస్ స్టేషన్ సిఐ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ కాచిగూడకు చెందిన చాకలి ఇందిర (42) అనే మహిళ నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాగ్‌లింగపల్లిలోని న్యాయవాది విపిన్ ఇంట్లో పనిమనిషిగా కొన్నాళ్ల క్రితం చేరిందని, ఆమె సక్రమంగా పనికి వస్తూనే ఇంట్లో 500, 2వేలు, 3వేలు రూపాయలు నగదును దొంగించుకుపోతున్నదని చెప్పారు. ఈ విషయాన్ని గమనించిన న్యాయవాది ఆమెను పనిలోంచి తీసివేయడం జరిందని సిఐ తెలిపారు. కాగా ఇటీవల న్యాయవాది అమమ్మ బీరువాలో ఉన్న 3 తులాల బంగారు మంగళ సూత్రం, రెండు తులాల బంగారు గోలుసు, అర తులం పుస్తెలు మాయమైనాయని గమనించి నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. సుల్తాన్ బజార్ డివిజన్ ఎసిపి కె.శంకర్ ఆధ్వర్యంలో నారాయణగూడ పోలీసులు విచారణ ప్రారంభించి చాకలి ఇందిరాపై నిఘా పెట్టారని, ఆమె బంగారు అభరణాలను తాకట్టు పెట్టడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని ఆయన తెలిపారు. పోలీసుల విచారణలో ఆమె దొంగతనం చేసినట్లు అంగీకరించడంతో పోలీసులు ఆమె వద్ద నుంచి ఐదున్నర తులాల భంగారు అభరణాలను స్వాదీనం చేసుకుని రిమాండ్‌కు తరలించడం జరిగిందని సిఐ వివరించారు. ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్ డిఎస్ఐ జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జి.వెంకటేష్‌ను ఎసిపి శంకర్ అభినందించారు.


మాట్లాడుతున్న సిఐ చంద్రశేఖర్

## ఉపాధ్యాయుల సంక్షేమానికి పిఆర్‌టియు కృషి
### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

**మర్కుక్, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** ఉపాధ్యాయుల సంక్షేమానికి పిఆర్‌టియు సంఘం ఎల్లవేళలా కృషి చేస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. మర్కుక్ కెజిబివిలో గణిత ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన గీతాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిఆర్‌టియు సంక్షేమ నిధి నుండి ఉపాధ్యాయురాలు గీతాదేవి కుటుంబసభ్యులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పిఆర్‌టియు పనిచేస్తుందని అన్నారు. ఉపాధ్యాయులకు పిఆర్‌టియు అండగా ఉంటుందని, ఎవరికి ఏ సమస్య వచ్చినా ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌టియు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, మర్కుక్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, తుమ్మ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, రజిత, కెజిబివి ప్రత్యేకాధికారిణి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు స్వాతి, శ్రీనివాస్, మోతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీకృష్ణుని పుష్పరథోత్సవం


పుష్పరథోత్సవం ముందు కోలాటం ఆడుతున్న భక్తులు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా గజ్వేల్ పట్టణంలోని శ్రీ మురళీ కృష్ణాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన పుష్పరథోత్సవంపై శ్రీకృష్ణున్ని అధీష్టింపజేసి ఆలయం వద్ద నుండి ప్రధాన రహదారి మీదుగా ఇందిరా పార్కు చౌరస్తా నుండి ఆలయం వరకు ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. పుష్పరథోత్సవముందు మహిళల కోలాటం, ఉట్టి కొట్టే కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. పుష్పరథోత్సవ ఊరేగింపులో శ్రీకృష్ణున్ని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఆలయ కమిటీ చైర్మన్ ఎలగందుల రామచంద్రం, సభ్యులు దూబకుంట మైత్రాములు, ఉప్పల వెంకటేశం, అత్తెల్లి లక్ష్మయ్య, అంతునూరి శివకుమార్, ఉప్పల మధు, కాశీనాథ్, పద్మ, వినోద, బాలమణి, శారద తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే భవిష్యత్తు బంగారుమయం : ఎస్ఐ


మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

**అల్లాదుర్గం, ఆగస్టు 27, ప్రభాతవార్త:** విద్యార్థినులు విద్యపై దృష్టి సారించి క్రమ శిక్షణతో విద్యను అందుకుంటే భవిష్యత్తు బంగారు మయం కావడ తధ్యమని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కళాబృంధం అల్లాదుర్గ సర్కిల్ పరిధిలోని కేజీవీబీ విద్యార్థినులకు మంగళవార అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కళా బృందం సభ్యులు విద్యార్థినులకు భవిష్యతుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులపై కళాకారులు పాటలతో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, అత్యాశకుపోకుండా జాగ్రత్తగా ఉండాలని, లక్కీడ్రా అంటూ మోసం చేస్తారని, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని, అపరిచితుల ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. అపరిచితులకు తమ వివరాలు, బ్యాంక్‌వివరాలు, ఓటిపిలు ఎలాంటి పరిస్తితుల్లోనే పంచుకోవద్దన వివరంచారు. సైబర్ నేరాలకు గురియితే వెంటనే 1930కి లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712657888కి లేదా సంబంధిత పోలీసు ఠాణాకు సమాచారం అందించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు పాల్పడితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు కాల్ చేయాలన్నారు. క్రమ శిక్షణతో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పోలీసు కళాబృందం సభ్యులు సురేందర్, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సిఐ

**కొమురవెల్లి(చేర్యాల)ఆగస్టు 27, ప్రభాతవార్త:** సైబర్ నేరస్తులతో జాగ్రత్తగా ఉండాలని..రుణమాఫీ విషయంలో ఏలాంటి మెసేజులు,ఫైల్స్ ఓపెన్ చేయొద్దని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. చేర్యాల పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంకు వద్ద రుణమాఫీ, బ్యాంకు పని మీద వచ్చిన రైతులు,ప్రజలు, వ్యాపారులకు మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో ఏదైనా సమస్య ఉంటే నేరుగా బ్యాంకుకు వెళ్లి బ్యాంకు అధికారులతో మాట్లాడాలన్నారు. రుణమాఫీ నేపథ్యంలో కొందరు సైబర్ నేరగాళ్లు ఏదో బ్యాంకు పేరిట వాట్సాప్‌న ప్రొఫైల్ బ్యాంకు పేరు పిక్చర్ బ్యాంకు లోగోతో వాట్సాప్ యాప్‌లో ఎపికె ఫైల్స్ పంపిస్తున్నారని తెలిపారు. ఎపికే ఫైల్స్ వస్తే ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా సైబర్ నేరాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను

## మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

**పంజగుట్ట,ఆగస్టు 27 (ప్రభాతవార్త):**

ఇళ్ళ దగ్గర నీళ్ళు వాడుకునే విషయంలో చిన్న సమస్య ఏర్పడగా దంపతులను, అడ్డు వచ్చిన మహిళను ఎక్కడపడితే అక్కడ తాకుతూ అసభ్యంగా ప్రవర్తించాడని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల ప్రకారం జూబ్లీహిల్స్ రోడ్డునంబర్ 10 లోఎన్వీ రమణబాబు నివశిస్తుంటాడు. వీరి పక్కనే రవికాంత్ నివాసముంటున్నాడు. వీరిరువురు నీటి అవసరాల కోసం ఒకే సంప్‌ను వాడుకుంటుంటారు,ఈ నేపథ్యంలో ఇటీవల రంగనాథ్ ఇంటికి తల్లిదండ్రులు వచ్చినప్పటి నుండినీరు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాడు.నీరు ఇవ్వకపోగా తరచుగా వీరిపై నానా మాటలు అంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు.గత వారం క్రితం ఇంకో వ్యక్తితో ఫోన్ చేయించి మాట్లాడదామని రమ్మన్నాడు. తాను అనారోగ్యంతో ఉన్నాని చెప్పినా వినకుండా కబురు చేస్తుండడంతో రమణబాబు అక్కడకు వెళ్ళాడు.అక్కడకు వెళ్ళిన వ్యక్తితో అసభ్యకరంగా మాట్లాడి ఇంట్లో ఉన్న భార్యపై కూడా చెప్పుతో దాడికి ప్రయత్నించాడు.దీంతో రమణబాబు కిందపడిపోయాడు.అక్కడే ఉన్న మరో మహిళ ఈ గొడవ సర్దిచెప్పడానికి ప్రయత్నించగా ఆమెపై కూఆ దాడికి దిగి విచక్షణారహితంగా మాట్లాడారు.ఆమె ఒంటిపై అసభ్యంగా చేతులు వేస్తూ భయకంపితులు చేయడంతో ఆమె అక్కడ నుండి పారిపోయింది. తర్వాత రమణబాబు సాయంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అబిడ్స్ ఇస్కాన్ మందిరంలో భక్తులకు అన్నదానం

**గోషామహల్, ఆగస్టు27ప్రభాతవార్త:** ప్రతియేటా మాదిరిగానే ఈ యేడు కూడా శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్స వాల భాగంగా అబిడ్స్ ఇస్కాన్ ఆద్వర్యంలో మంగళవారం భగవాను కృష్ణుడి జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని నలుమూల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. భక్తిగీతాలు, ప్రవచనలు, సంకీరక్తలను తదితరు పూజ కార్యక్రమాలను నిర్వహించారు. లోక కళ్యాణం కోసమే అసాదరణ సాహసాలు ప్రదర్శించిన భగవంతుడు శ్రీకృష్ణుడన్నారు. ఇస్కాన్‌మందిరం గురువు భక్తివేదాంత ప్రభుగురువు జన్మదినోత్స వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు, భక్తులకు అన్నదానం, ప్రసాదాలను అందచేశారు.

## ప్రజల ఆరోగ్యం కోసం సమర్థవంతమైన స్వచ్ఛత

**...డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి**

**తార్నాక, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్యం కోసం సమర్థవంతమైన స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టాలని అధికారులను నగర డిప్యూటీ మేయర్ ఆదేశించారు. టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి, డిప్యూటీ కమీషనర్ సుభాష్ మంగళవారం ఇతర అధికారులతో కలిసి లాలాపేట్ ఇసుకబావి, పెద్దనాల తధితర ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా పారుశుద్ధ పనులను వారు పరిశీలించారు. పరిసరరాల శుభ్రతపై డిప్యూటీ మేయర్ స్థానికులకు అవగాహణ కల్పించారు. అదేవిదంగా తార్నాక, లాలాపేట్ ప్రధాన రోడ్లకు ఇరువైపుల కొందరు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పాదాచారులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆక్రమంగా వెలసిన వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటేష్, రాంకీ దశరత్, ప్రసన్న, నాయకులు ప్రవీణ్, షేక్ మక్బూల్, సుభాన్, శ్రీనివాస్ తధితరులు పాల్గొన్నారు.

## ప్రమాదం జరిగితే తప్పా స్పందించరా?



**అత్తాపూర్ ఆగస్టు27,ప్రభాతవార్త :** శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో విద్యుత్ స్తంబాలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలను పొంచి ఉన్న విద్యుత్ శాఖ, జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ఐదు రోజుల క్రితం ఈ స్తంభాలకు అనుకొని ఉన్న ఎండిన చెట్టును డిసిఎం ఢీకొనడంతో ఆ చెట్టు పూర్తిగా స్తంభంకు ఉన్న తీగలపై పడటంతో మరింత ప్రమాదానినన పొంచి ఉంది. ఈ మార్గంలో నిత్యం వాహనాలు, పాఠశాలలో రాకపోకలు సాగిస్తుండటంతో ఇప్పడేం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడైన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన అధికారులు పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. అధికారుల తీరు చూస్తుంటే ప్రమాదం జరిగితే తప్ప పట్టించుకోము అన్నట్లుగా అనిపిస్తుంది. అసలే వర్షాకాలం కావడంతో ఏ క్షణం ప్రమాదం సంభవిస్తోందనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### తారిఖ్ అన్వర్‌ను కలిసిన పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్, ఆగస్టు 27 ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరానికి విచ్చేసిన ఏఐసిసి ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యులు తారీఖ్ అన్వర్‌ను మంగళవారం మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, టిపిసిసి సీనియర్ వైస్ ప్రెశిడెంట్, రాజీవ్ గాంధీ సద్భావనాయాత్ర స్మారక సమితి చైర్మన్ జి.నిరంజన్, బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గురంచి ఏఐసిసి ప్రధాన కార్యదర్శి తారీఖ్ అన్వర్ అడిగి తెలుసుకున్నారని బహదదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు. పాతబస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఫాతిమా స్కూల్‌పై విచారణ జరిపించాలి



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న పాతబస్తీ బిజెపి నాయకులు

**చార్మినార్, ఆగష్టు 27 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బండ్లగూడ సూరం చెరువుపై వెలచిన అక్రమ కట్టడాలు, ఓవైసీ బ్రదర్స్ నిర్మించిన ఫాతిమా స్కూల్‌పై తగు విచారణ జరిపించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి పాతబస్తీ బిజెపి నాయకులు వినతి పత్రం అందజేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసివినతి పత్రం అందజేసిన వారిలో భారతీయ జనతా యువమోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి శివ చంద్రగిరి, దళిత మోర్చ అధ్యక్షులు రాజేశ్వర్, బిజెపి నాయకులుపవన్ కుమార్, నర్సింగరావులు ఉన్నారు. ఈ సందర్భంగా శివ చంద్రగిరి మాట్లాడుతూ బండ్లగూడ సూరం చెరువు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు.

## రాష్ట్ర వ్యాప్తంగా సెట్విన్ సేవల విస్తరణ : చైర్మన్ ఎన్.గిరిదర్ రెడ్డి



సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి పాతబస్తీ మోతీగల్లీలోని సెట్విన్ కేంద్రాన్ని సందర్శించనప్పటి చిత్రం.

**యాకుత్‌పుర, ఆగష్టు 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో సెట్విన్ సేవలను విస్తరింప చేయటానికి తన వంతు కృషి చేస్తానని సెట్విన్ సంస్థ చైర్మన్ ఎన్.గిరిధన్ రెడ్డి అన్నారు. జహీరాబాద్, తాండూర్, వికారాబాద్, సంగారెడ్డి, జడ్చెర్ల ప్రాంతాలలో సెట్విన్ కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. చార్మినార్ సమీపంలోని మోతీగల్లీలో ఉన్న సెట్విన్ కేంద్రాన్ని మంగళవారం ఆయన సెట్విన్ సంస్థ ఎండి కె.వేణుగోపాలరావుతో కలిసి సందర్శించారు. బ్యూటీషియన్, కంప్యూటర్, టైలరింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ప్రింటింగ్ ప్రెస్ కేంద్రాలను పరిశీలించి వివరాలను చైర్మన్ గిరిధర్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలియజేశారు.

# ఆటో కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

**-ఐటీసీ హాస్టల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి**




ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం తొలగించాలని కోరుతూ పోచారం ఇన్ఫోసిస్ కంపెనీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ సభ్యులు.

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 27, ప్రభాతవార్త:**

ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం తొలగించాలని కోరుతూ ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. పోచారం మున్సిపల్ ఇన్ఫోసిస్ కార్యాలయం వద్ద ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళ వారం ఐటీ కంపెనీ చర్యల వల్ల వందలాది మంది హాస్టల్, హోటల్, ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నామని వెంటనే ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం తొలగించి వర్క్ ఫ్రం ఆఫీస్ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ 2020 ఏప్రిల్ 2024 ఆగస్టు వరకు ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం కొనసాగుతుందని అన్నారు. కొవిడ్ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు ఐటీ ఉద్యోగుల కొరకు ఇబ్బంది కలుగకుండా హాస్టల్స్, హోటళ్లు నిర్వహించామని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఐటీ ఉద్యోగులు ఇక్కడకు విచ్చేసి ఉద్యోగం చేస్తుండటంతో కోవిడ్ సమయంలో వారికి ఇబ్బంది కలుగకుండా తమ వంతు సహాయసహాకారాలు అందించామని అన్నారు. దాదాపు గత నాలుగేళ్లుగా ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం కొనసాగుతుండటంతో కంపెనీ సమిపంలో వెలిసిన హాస్టళ్లు, హోటళ్లు, ఆటో కార్మికులకు ఉపాధి కరువైందని అన్నారు. దీంతో ఎంతో మంది హోటళ్లల్లో పనిచేసే కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇకనైనా ఇన్ఫోసిస్ యాజమాన్యం ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం ఆఫీస్ కల్పించినట్లయితే ఎన్నో విధాలుగా అన్ని రంగాల వారికి ఉపాధి కల్పించినవారౌతారని అన్నారు. దయచేసి తమ విజ్ఞప్తిని స్వీకరించాలని కోరుతూ కంపెనీ రోడ్డు గుండా ప్లే కార్డులు చేతబూని ర్యాలీ నిర్వహించారు. తమ సమస్య పరిష్కరం కొరకు ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఐటీ అధికారులను కలిసి సమస్యను వివరిస్తామని అన్నారు. తమ సమస్య పరిష్కరం అయ్యేంతవరకు దశల వారిగా ఆందోళనలు కొనసాగిస్తామని ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి మహీధర్, హాస్టల్ భవన యాజమానులు సుధీర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపేందర్, రాంరెడ్డి, శ్రీకాంత్, వేణు, ఆర్‌కె. వర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యూపిఎస్‌సి సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలో సత్తాచాటిన జయకృష్ణ



సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న జయకృష్ణ

**మహేశ్వరం, ఆగష్టు 27, ప్రభాతవార్త :** 2024 సంవత్సరానికి యూపిఎస్‌సి సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రామీణ యువతకు మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ యువకుడు గడ్డమీది జయకృష్ణ ఆదర్శంగా నిలిచాడు. భారతదేశం మొత్తం నుండి పదమూడు లక్షల నలభై వేల మంది యుపిఎస్‌సీ పరీక్షలు రాయగా అందులో కేవలం 14,625 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మన తెలంగాణ రాష్ట్రం నుండి కేవలం వందల మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. జయకృష్ణ తల్లిదండ్రులు నిరక్ష్యరాస్యులు, రోజు కూలీ పని చేసుకుని జీవనం కొనసాగించే పేద కుటుంబంలో పుట్టిన జయకృష్ణ కష్టపడి చదువుతూ, పట్టుదలతో ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. తెలంగాణ రాష్ట్రం నుండి యుపిఎస్‌సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మెయిన్ ఎగ్జామ్ ప్రిపరేషన్ కోసం ప్రోత్సాహకంగా ఉండేలా తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి సంస్థ ఒక సామాజిక బాధ్యతగా ఆర్థిక సహాయం చేయడం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పేరుతో లక్ష రూపాయల చెక్కులను విజేతలకు అందజేయడం జరిగింది. తుమ్మలూరు వాసి జయకృష్ణ కూడా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్కుని అందుకున్నారు.

### సామాజిక సేవలో జయకృష్ణ...

తుమ్మలూరు గ్రామంలోని విద్యార్థులు, యువత బాగా చదివి ఉన్నత స్థానాలకి ఎదగాలని, గ్రామ యువకుడు కటికెల యాదగిరి చేస్తున్న వివిధ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, విద్యార్థులను ప్రోత్సహించడంలో ముందుడి సహకరిస్తూ తన జ్ఞానాన్ని విద్యార్థులతో పంచుకుంటున్నట్లు తెలిపారు. జయకృష్ణ ఐఏఎస్ అధికారి కావడానికి ఇంకా ఒక్క అడుగు దూరంలో ఉన్నాడని, యుపిఎస్‌సీ ఫైనల్ ఎగ్జామ్‌లో కూడా ఉత్తీర్ణ సాధించి తుమ్మలూరు గ్రామ నుంచి మొట్టమొదటి కలెక్టర్‌గా అవుతాడని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు భగవంతుని ఆశీస్సులతో పాటు గ్రామస్థుల ఆశీస్సులు జయకృష్ణపై ఉంటాయని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు కటికెల యాదగిరి, రాజమోని శ్రీశైలం, లింగారెడ్డి, చోటు, కార్తీక్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శేరిల మైసమ్మ బోనాల ఉత్సవాలు

**కొందుర్గు, ఆగస్టు 26, (ప్రభాతవార్త) :**



ఊరేగింపుగా తరలి వెలుడుతున్న శేరిల మైసమ్మ బోనాలు.

మండల కేంద్రంలోని గ్రామ దేవత అయిన శేరిల మైసమ్మ తల్లికి అంగరంగ వైభవంగా బోనాలు, ఉత్సవాలను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా శ్రావణ మాసం చివరి సోమవారం నాడు మండల కేంద్రంలోని షాద్‌నగర్ రోడ్డు ప్రక్కన వెలిసిన శేరిల మైసమ్మ దేవతకు ఎడ్ల బండ్లను తిప్పి బోనాలను నిర్వహిస్తారు. బోనాలను పురస్కరించుకొని దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ ద్వీపాలు, పచ్చన తోరణాలతో పూల దండలతో ఆలంకరించారు. అంతేగాకుండా భక్తి గీతాలను మండల కేంద్రంలో మైకుల ద్వారా వినిపించారు. ఉదయం నుంచే భక్తులు తమ తమ వాహనాలలో వచ్చి పూజలు చేయించారు. సాయంత్రం ఆలంకరించిన ఎడ్ల బండ్లను ప్రదక్షణ చేయించారు. అనంతరం తెలంగాణ తల్లి బోనం ముందు రాగా వెంటనే బోనాల సముదాయం దేవాలయానికి చేరుకొని ప్రదక్షణలు చేసి బోనం సమర్పించి మహిళలు మొక్కుబడిని తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపు ముందు యువకులు నృత్యాలు చేస్తూ సంబరాలను పంచుకున్నారు. ఈ సంబరాల్లో మాజీ వైస్ ఎంపిపి రాజేష్‌పటేల్, మాజీ ఎంపీటీసీ కావలి యాదయ్య, బీజేపీ నాయకులు ఇసారి సత్యనారాయణతో పాటు యువ నాయకులు గుంటి నరేందర్ మొద్దు యాదగిరి, మల్లేష్, సీలం లింగంతో పాటు మహిళలు, గ్రామస్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ, గోపికల వేషాధారణలో చిన్నారులు

**షాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :**

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడలో శ్రీచైతన్య హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే శ్రీకృష్ణుడు, గోపికల వేషాదరణ వేయించి గ్రామంలో కోలాటాలు ఆడుతూ, కీర్తనలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడలిలో ఉట్టి ఏర్పాటు చేసి, శ్రీకృష్ణ వేషాధారణ ఉన్న విద్యార్థులచే పగలగొట్టించారు. ఈకార్యక్రమం గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

## బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా శ్రీరాములు



నియామక పత్ర ం అందుకుంటున్న శ్రీరాములు

**ఘట్‌కేసర్, ఆగష్టు 27, ప్రభాతవార్త:**

బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా ఎదుగని శ్రీరాములు నియమితులయ్యారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌కు చెందిన శ్రీరాములు ఓబీసీ మోర్చ జిల్లా కార్యవర్గంలో చురుకుగా పని చేయడంతో ఆయనకు రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించినట్లు తెలిపారు. ఈమేరకు ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్‌గౌడ్, ప్రధానకార్యదర్శి నందనం దివాకర్, ఈశ్వరప్ప, ఉపాధ్యక్షులు సదానంద, కార్యదర్శి గుండ్ల అంజనేయులుగౌడ్‌ల ఆధ్వర్యంలో శ్రీరాములు భాధ్యతలు స్వీకరించారు. తనకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పదవి ఇవ్వడానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, జాతీయ ఓబీసీ మోర్చ అధ్యక్షులు కె.లక్ష్మణ్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సంజయ్, గొంగళ్ల మహేశ్, కాలేరు రామోజీ, బొడ్డు రవిలకు శ్రీరాములు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కూచిపూడి నాట్య ప్రదర్శనలో మోక్షధృతికి అవార్డు



దైవజ్ఞశర్మ నుంచి అవార్డు అందుకుంటున్న మోక్షధృతి

**ఘట్‌కేసర్, ఆగష్టు 27, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన మోక్షధృతికి ఉత్తమ నాట్యకళాకారిణి అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో జరిగిన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. మోక్షధృతి పాల్గొని అత్యుత్తమ నాట్య ప్రదర్శన చేయగా జ్యోతిష్యుడు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకుంది. నృత్యరంగంలో బాలికలు రాణించడం ద్వారా భారతీయ నృత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేలా ప్రదర్శనలు ఉండాలని ఆయన అన్నారు. లహరి నృత్య నికేతన్ చైర్‌పర్సన్, నాట్యగురువు డాక్టర్ పి.ఝాన్సీరామ్ మాట్లాడుతూ సాంస్కృతిక రంగాల్లో రాణించిన ప్రతిఒక్కరికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కూచిపూడి నాగ్య ప్రదర్శనలో మోక్షదృతి అత్యుత్తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించినట్లు ఆమె తెలిపారు.

### డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయస్థాయి అవార్డుకు రాజు ఎంపిక

**పూడూరు, ఆగష్టు 27, ప్రభాతవార్త :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయస్థాయి అవార్డుకు పూడూరు మండలం కడ్మూరు గ్రామానికి చెందిన, వికారాబాద్ జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్యాగరి రాజును జాతీయ అవార్డు సెలెక్షన్ కమటీ ప్రకటించింది. ఈ మేరకు జాతీయ అవార్డు సెలెక్షన్ కమటీ నేషనల్ చైర్మన్, బిఎస్ఎ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఆహ్వాన పత్రాన్ని రాజుకు హైద్రాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు సెలెక్షన్‌కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ఎస్, ఎస్‌టి, బిసి, మైనార్టీల సాహిత్యం అభివృద్ధి చేసేందుకు కృషిచేసే ఉద్యమకారులు. సంఘసేవకులు, రచయితలు, కవులు, కళాకారులు, స్వచ్ఛంద సంస్థలకు ప్రతి సంవత్సరం ఈ అవార్డును అందజేయనున్నట్లు వివరించారు. 2024 సంవత్సరానికిగాను రాజును ఎంపిక చేసినట్లు, సెప్టెంబర్ 5వ తేదీన అంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 8వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అవార్డులను ప్రధానం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయస్థాయి అవార్డు గ్రహిత బ్యాగరి రాజు మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేసినందుకు సెలెక్షన్ కమిటీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎం గౌతం, కో ఆర్డినేటర్, హనుమాండ్లు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



**అత్తాపూర్ ఆగస్టు27,ప్రభాతవార్త :** ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని అడిషనల్ డిసిపి విజయ కుమార్, ఎసిపి శ్రీనివాస్, డిసి రవి కుమార్‌లు పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ డిసిపి విజయ కుమార్, ఎసిపి శ్రీనివాస్, డిసి రవి కుమార్‌లు మాట్లాడుతూ....ప్రతి ఒక్కరూ కూడా మట్టి వినాయుడిని పూజించాలని పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని గణేష్ మండపం సభ్యులు తప్పకుండా పర్మిషన్ తీసుకోవాలని అన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను జరుపుకోవాలని ఎవైనా అవాంఛానియ ఘటనలు కారణమైతే కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు అనుమతి ప్రకారం తమ నిమజ్జనాన్ని జరుపుకోవాలని సూచించారు. పోలీసులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు అవగాహన కల్పించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ కూడా అధికారులకు సహకరించి ప్రశాంతవాతవరణంలో విజయవంతం జరిగే విధంగా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వివిధ పార్టీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీల్లో అద్యాపక పోస్టులను భర్తి చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి

**తమ సమస్యలపై మాట్లాడకపోవడం విచారకరం: కాంట్రాక్ట్ అధ్యాపకులు**



తమ సమస్యలపై మాట్లాడుతున్న ప్రొ.ధర్మతేజ ఇతర ప్రొఫెసర్లు

**తార్నాక, ఆగస్టు 27 ప్రభాతవార్త :** యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి తమ దీర్గ కాలిక సమస్యలపై మాట్లాడకపోవడం విచారకరమని పలువురు కాంట్రాక్ట్ అధ్యాపకులు డా.ధర్మతేజ డా.ఎస్.విజయేందర్, డా. ఇ.ఉపేందర్, డా.తాళ్లపల్లి వెంకటేష్, డా. రేష్మారెడ్డి, డా. యాదయ్య, డా.చిరంజీవి, డా.భుక్యారమేష్, డా. కె.ప్రేమ్‌కుమార్ తధితరులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ తమకు బేసిక్ పే, డీఏ, హెచ్‌ఆర్‌ఏతో కూడిన పే స్కేల్ వెంటటనే అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి త్వరలో వర్సిటీలకు వీసీలను నియమిస్తామని, కాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తి చేస్తామని చెప్పడాన్ని తాము స్వాగతిస్తున్నామని కాని తమ ప్రస్థావన ఎక్కడ కూడా లేకపోవడం బాదకల్గిస్తుందన్నారు. తాము ఎన్నో ఏండ్లుగా అధ్యాపకులుగా కొనసాగుతున్నామని తమను రెగ్యులరైజ్ చేసిన తరువాతనే అధ్యాపక పోస్టులను ఖాళీ చేయాలని వాకె డిమాండ్ చేశారు. అనేక సంత్సరాలుగా తాము చాలిచాలని వేతనాలతో అన్యాయానికి గురవుతు జీవితాలను కొనసాగిస్తున్నామని వాపోయారు. తమకు యూజీసీ పేస్కేల్ అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్టవ్యాప్తకంగా 1445 కాట్రాక్ అధ్యాపకులు ఉన్నారని వారి పోస్టులకు రక్షణ కల్పించిన తరువాతనే మిగితా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. గత ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేస్తామని హామినిచ్చి మాట తప్పిందని ఆరోపించారు. తమ సమస్యలను ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని లేనిచో తాము దశలవారిగా ఆందోళనలు చేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు.

## రైతునేస్తంలో వరిపంటపై అవగాహన

**పూడూరు, ఆగష్టు 27, ప్రభాతవార్త :** అర్హులు అందరికి పంటరుణాలు మాఫీ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని పిఏసిఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసిందని, రుణాలు మాఫీ కాని రైతులకోసం ప్రభుత్వ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వరిపంట సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు వివరించారు. ఈ రార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, డివిజన్ అధికారి లక్ష్మీకుమారి, ఏఓ తులసీరాం, మాజీ ఎంపిటిసిలు సురేందర్, లక్ష్మణ్, రైతులు వెంకట్‌రెడ్డి, లింగప్ప, యాదగిరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

**-మాజీ ఎంపిపి పిన్నింటి మధుసూదన్‌రెడ్డి**

**కొత్తూర్, ఆగష్టు 27, ప్రభాతవార్త :**

కొత్తూర్ మండలం ఎస్‌బిపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా హరితహారం మొక్కల పంపిణీ కార్యక్రమం మంగళవారం తాజా మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాజా మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. మొక్కల దాతలు ప్రభోద సేవ సమితి సభ్యులు మన్నె మల్లేష్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామ ప్రజలు మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామ ప్రజలు మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో విలేజ్ సెక్రటరీ, ప్రధానోపాధ్యాయులు, మాజీ సర్పంచ్ రవినాయక్, మాజీ వార్డు సభ్యులు సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం, కోఆప్షన్ సభ్యులు సురేష్‌గౌడ్, యాదయ్య, ఎమ్మె వెంకటయ్య, అంబటి శేఖర్, ఎమ్మె శ్రీశైలం, అంబటి విష్ణు, అంబటి శ్రీశైలం, లక్ష్మారెడ్డి, అంబటి నందు, రాము, మహేష్, అంబటి వెంకటేశ్, లింగం, నరసింహారెడ్డి, జయేందర్‌రెడ్డి, దయానందరెడ్డి, బోకుల రాజు, రాములుగౌడ్, శ్రీశైలం, రవినాయక్, నవీన్, రవి, వంశీ, మధు, బన్నీ, విజయ్, గ్రామస్థులు ఉన్నారు.

### శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**కడ్తాల్, ఆగష్టు 27 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినాయక మండపాలు రోడ్డుకు దూరంగా వేసుకోవాలని రోడ్డులో వేస్తే వాహనాలకు ఇబ్బంది ఏర్పడుతుందని ఆయన సూచించారు. వినాయక నిమజ్జనం అయ్యే వరకు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిని అరెస్టు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈసారి డిజె పర్మిషన్ లేదని ఎవరైనా డిజె యజమానులు డిజె పెడితే వారికి జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుందని ఆయన తెలిపారు. సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటి సభ్యులు, యువకులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు హాజరయ్యారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**షాబాద్, ఆగష్టు 27, ప్రభాతవార్త :**

సీజనల్ వ్యాధులు, కురుస్తున్న వర్షాలకు హాస్టల్ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ డీవో అపర్ణ అన్నారు. మంగళ వారం హైతాబాద్, షాబాద్‌లోని హాస్టళ్లను విజిట్ చేసి వాటర్ ట్యాంక్, హాస్టల్ పరిసరాలు, కిచన్ షెడ్, స్టాక్ రిజిస్టార్‌లను చూశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డె న్లు స్వప్న, జ్యోతి, శేఖర్ తదితరులు ఉన్నారు.